క్లుప్తంగా

గాయత్రి బ్రాహ్మణ భవనం ప్రారంభం



శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న బ్రాహ్మణ సంఘం సభ్యులు

రాయదుర్గం టౌన్: పట్టణంలోని కోటలో నియోజకవర్గ బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో గాయత్రి బ్రాహ్మణ భవన ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా శాంతిహోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘం కోశాధికారి హెచ్‌కే మనోహర్, రాష్ట్ర , జిల్లా కమిటీ సభ్యులు హాజరైనట్లు బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు కోడూరు రవీంద్రనాథ్ తెలిపారు.

ఇంటర్ విద్యార్థినికి నగదు ప్రోత్సాహకం



తనూజకు నగదును అందిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

కణేకల్లు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని తనూజ (927/1000) మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. దీంతో కణేకల్లు లయన్స్‌క్లబ్ సభ్యులు ఆమెకు రూ.10 వేల నగదు ప్రోత్సాహకం అందించారు.

ఆర్టీసీ బస్సు ఢీ కొని బాలుడికి గాయాలు



తీవ్రంగా గాయపడిన బాలుడు యశ్వంత్

కణేకల్లు: మండల కేంద్రంలోని దిగువవీధిలో ఆర్టీసీ బస్సు ఢీకొని యశ్వంత్ అనే బాలుడికి కాలు నుజ్జునుజ్జయ్యింది. వివరాలు.. పెద్దవడుగూరు మండలం ముప్పాలగుత్తికు చెందిన మీనాక్షి, రామాంజనేయులు కణేకల్లులో బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యానికి వచ్చారు. ఇంటిముందున్న మెయిన్‌రోడ్డులో కొంతస్థలంలో షామియానా వేశారు. ఈసమయంలో ఆర్టీసీ బస్సు కణేకల్లు నుంచి ఉరవకొండకు వెళ్తోంది. అక్కడే ఉన్న బాలుడు రోడ్డుపైకి వచ్చాడు. దీంతో బాలుడి కుడికాలుపై బస్సు చక్రం వెళ్లడంతో పాదం నుజ్జునుజ్జయ్యింది. ప్రథమ చికిత్స అనంతరం బాలుడిని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

చెక్‌డ్యాంలు, కుంటలకు జలకళ



కూడేరు: వర్షం నీటితో నిండిన చెక్‌డ్యాం

కూడేరు: కూడేరు మండలంలో పలు గ్రామాల్లో వారం రోజులుగా మోస్తరు వర్షం కురిసింది. సగటున 20 నుంచి 40 మిల్లీ మీటర్ల వర్షం పాతం నమోదైంది. పలు గ్రామాల్లోని చెక్ డ్యాంలు, ఫారంపాండ్లు, కుంటలు వర్షం నీటితో నిండాయి. గతేడాది వర్షాలు లేక భూగర్భ జలాలు బాగా అడుగంటి పోయాయి. వ్యవసాయ బోర్లలో నీటి లభ్యత తగ్గిపోయింది. ఈ సారి వర్షాలు ఖరీఫ్ సీజన్ ఆరంభంలోనే వర్షాలు కురుస్తుండడంతో రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వేరుశనగ , కంది, ఆముదం ఇతర పంటలు సాగు చేసుకుంటామని రైతులు పేర్కొంటున్నారు. కుంటలు, చెక్‌డ్యాంల్లో నీరు నిల్వ ఉంటే భూగర్భ జలాలు పెరగుతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.

దశభుజ మహా గణపతికి విశేష పూజలు



పూజలందుకున్న దశభుజ మహా గణపతి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ఆత్మకూరు వీధిలో వెలసిన దశభుజ మహాగణపతికి ఆదివారం విశేష పూజలు జరిగాయి. ప్రతి ఆదివారం స్వామి వారికి అభిషేకం, పూజలు నిర్వహిస్తారు. స్థానిక భక్తులే కాక కర్ణాటక నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి, మొక్కులు తీర్చుకున్నారు.

ఉరవకొండ.. అంతటా ఉత్కంఠ

- సెంటిమెంట్ బద్దలు కొట్టనుందా?
- కౌంటింగ్‌లో తొలి ఫలితం ఉరవకొండదే
- వైఎస్సార్‌సీపీ చరిత్ర సృష్టించడం ఖాయమంటున్న రాజకీయ విశ్లేషకులు



ఈనెల 13న ఉరవకొండ మండలం వైరాంపురంలో ఓటు వేసేందుకు బారులుదీరిన మహిళలు



ఉరవకొండ: జిల్లాలోని అత్యంత ఆసక్తి రేపుతున్న ఉరవకొండ అసెంబ్లీ ఎన్నికల ఫలితంపై అంతటా ఉత్కంఠ నెలకొంది. గత 20 ఏళ్లుగా ఇక్కడ ఓటర్లు విలక్షణ తీర్పు ఇస్తూనే వస్తున్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన అభ్యర్థి పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రాదన్న సెంటిమెంట్ 1994 ఎన్నికల తర్వాత నుంచి ఇప్పటి వరకు 20 ఏళ్లుగా కొనసాగుతూ వస్తోంది. అయితే ఈఎన్నికల్లోనూ అదే సెంటిమెంట్ కొనసాగుతుందా? లేదా సెంటిమెంట్‌ను బద్దలు కొట్టి నియోజకవర్గ ప్రజలు కొత్త చరిత్రను తిరగరాస్తారా? అన్నది అందరిలోనూ ఉత్కంఠను రేకెత్తిస్తోంది. రాజకీయ ఉద్దండులకు నెలువైన ఉరవకొండ అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నుంచి ఎంతో రాజకీయ అనుభవం కలిగిన మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర రెడ్డి, మరోవైపు టీడీపీ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ బరిలో నిలిచారు. 2004 నుంచి వరుసగా ఐదోసారి విశ్వేశ్వరరెడ్డి, పయ్యావుల కేశవ్‌లు ఎన్నికల బరిలో తలబడుతుండటం విశేషంగా చెప్పాలి.

సెంటిమెంట్‌ను తిరగరాసేదెవరో?

ఉరవకొండ నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో 85.78 శాతం పోలింగ్ జరిగింది. ప్రస్తుత ఎన్నికల్లో గత 20 ఏళ్లుగా కొనసాగుతూ వస్తున్న ఉరవకొండ నియోజకవర్గ ప్రజలు సెంటిమెంట్‌ను బద్దలు కొట్టి, కొత్త చరిత్ర సృష్టించబోతున్నట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇందుకు ప్రధాన కారణం గత ఐదేళ్ల కాలంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన ప్రజాసంక్షేమ కార్యక్రమాలు, నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులు నిలుస్తాయి. ముఖ్యంగా వైఎస్సార్ సీపీ అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి నిత్యం ప్రజల్లో ఉంటున్నారు. ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ వచ్చారు. ప్రజాప్రతినిధులు కూడా ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించేలా కృషి చేశారు. సంక్షేమ పథకాలు లబ్ధిపొందిన పేద, మధ్యతరగతి ప్రజలు తిరిగి వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే రావాలని బలంగా ఆకాంక్షించారు. ముఖ్యంగా ప్రభుత్వ పథకాలతో సింహభాగం లబ్ధిపొందిన మహిళలు, వృద్ధులు ఫ్యాన్ గుర్తుకు ఓటేసి, తమ కృతజ్ఞతను చాటుకున్నట్లు పోలింగ్ సరళిని బట్టి తెలుస్తోంది. ప్రజల ఆకాంక్షల మేరకు ఉరవకొండ అసెంబ్లీ నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి విజయం సాధించి కొత్త చరిత్ర సృష్టించడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

తొలిఫలితం ఉరవకొండదే :

ఉరవకొండ నియోజకవర్గం ఎన్నికల ఫలితం రాష్ట్ర వ్యాప్తంగా అందరి దృష్టినీ ఆకర్షిస్తుంది. గత 20 ఏళ్లుగా సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌లో క్షణం క్షణం నరాలు తెగే ఉత్కంఠ మధ్య సాగుతుంది. ఒక్కోసారి అర్ధరాత్రి దాటినా ఫలితం తేలేది కాదు. ఇలాంటి నేపథ్యంలో ఈసారి జిల్లాలో మెట్టమొదట ఉరవకొండ ఫలితం వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో అత్యధికంగా 18 టేబుళ్ల, 15 రౌండ్లలో ఫలితం తేలనుంది. జూన్ 4న సార్వత్రిక ఎన్నికల లెక్కింపు రోజున మొదటగా ఉరవకొండ ఫలితం వెలుబడుతుందని, ఆ రోజు కోసం ప్రతి ఒక్కరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

కబ్జా స్థలం స్వాధీనం



బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

రాయదుర్గం: పట్టణంలోని శాంతినగర్‌లో వైఎస్సార్ విగ్రహం వెనుక భాగంలో ఉన్న రూ.కోటి విలువజేసే ప్రభుత్వ స్థలం ఆక్రమణదారుల నుంచి రెవెన్యూ అధికారులు పరిరక్షించారు. ఈ నెల 18న 'రూ.కోటి విలువైన స్థలంపై కన్ను' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైంది. అందుకు జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ స్పందించారు. ఆర్డీఓ రాణీసుస్మితతో ఆరాతీశారు. ఈ నేపథ్యంలో దానిపై సమగ్ర విచారణ కోరుతూ తహసీల్దార్ చిట్టిబాబుకు ఆర్డీఓ ఆదేశాలు జారీ చేశారు. పరిశీలన అనంతరం ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకుంటున్నట్లు రెవెన్యూ అధికారులు ఆదివారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

ఖరీఫ్ పంటల సాగుకు రైతుల సన్నద్ధం



వెంకటాంపల్లి చిన్నతండాలో విత్తన కాయలు ఒలుస్తున్న రైతులు



వజ్రకరూరు వద్ద పొలాన్ని సిద్ధం చేసిన అన్నదాత

వజ్రకరూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో ఖరీఫ్ పంటల సాగుకు అన్నదాతలు సిద్ధమవుతున్నారు. ఇటీవల మండలంలో భారీ వర్షాలు కురిశాయి. దీంతో రైతులు పొలాలను దుక్కులు చేసి, సాగుకు సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు.

మండలంలో ఖరీఫ్ సీజన్‌లో సాధారణంగా 17 వేల హెక్టార్లలో పంటలు సాగు చేయనున్నట్లు వ్యవసాయాధికారులు చెప్తున్నారు. ఈఏడాది పంటలు బాగా పండి మంచి దిగుబడులు రావాలని రైతులు కోరుతున్నారు. ఖరీఫ్ సీజన్ దగ్గరపడటంతో అధికారులు 40 శాతం రాయితీతో విత్తన వేరుశనగ పంపిణీ ప్రారంభించారు. విత్తన కాయలు పొందిన రైతులు సాగు కోసం శుద్ధి చేస్తున్నారు. మండలంలో ఎర్ర నేలలు అధికంగా ఉన్న గ్రామాల్లో ఖరీఫ్ సీజన్‌లో భాగంగా రైతులు వేరుశనగ, కంది, ఆముదం తదితర పంటల సాగుకు ఆసక్తి చూపుతున్నారు.

లోతు దుక్కులతో చీడపీడల నివారణ



చిన్న ముష్టూరు సమీపంలో వేసవి దుక్కులు చేస్తున్న రైతు

ఉరవకొండ: లోతుగా దుక్కులు చేయడం వల్ల నేల లోపలి పొరలు బయటపడి, పొలం సారవంతం అవుతుందని ఏట శుభకర్ తెలిపారు. ఆదివారం ఆయన వేసవిలో చేయాల్సిన దుక్కులు, పంటల సాగుకు ముందు ఎరువుల వాడకం, విత్తన సాగు తదితర అంశాలపై రైతులకు తెలియజేశారు. మండే ఎండను సైతం పండే పంటకు ఉపయోగించుకోవచ్చు. ఖాళీగా వదిలేస్తే భూమి నిస్సారంగా తయారవుతుంది. మరికొద్ది రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. ఈసమయంలో రైతులందరూ ఏ పంట వేస్తే దిగుబడి బాగా వస్తుంది.. ఎప్పుడు విత్తనాలు, ఎరువులు వేసుకోవాలి. తదితర అంశాలపై ముందస్తు ప్రణాళికలు చేస్తుంటారు. వీటన్నింటిపైనా ఏట తెలియజేశారు.

వేసవి దుక్కులతో ప్రయోజనాలు:

- రైతులు వేసవిలో భూసార పరీక్షలు చేయించుకోవాలి. భూమిని శుభ్రం చేసుకోవాలి. లోతుగా దుక్కులు చేయడం వల్ల ఖరీఫ్‌లో పంటల దిగుబడి పొందడానికి అవకాశం ఉంటుంది.
- సాధారణంగా 30 నుంచి 70 సెంటి మీటర్ల లోతుగా దుక్కులు చేయడం వల్ల ప్రయోజనం ఉంటుంది.
- వాలుకు అడ్డంగా దుక్కులు చేయడం వల్ల భూమి కోతకు గురికాకుండా ఉంటుంది. అంతేకాక భూమిలో తేమశాతం ఎక్కువ కాలం ఉంటుంది. పొలంలో పెరిగిపోయిన కలుపు మొక్కలు వేసవి దుక్కుల వల్ల ఎండిపోయి నశిస్తాయి. ప్రధాన పంట సమయంలో కలుపు బెడద తగ్గుతుంది.
- ట్రాక్టర్ల ద్వారా లోతు దుక్కులు చేయడం వల్ల భూమి గుల్లగా మారి వర్షపు నీటిని ఎక్కువ కాలం నిలుపుకుటుంది.
- పంట కాలంలో చీడపీడలు, పురుగుల అవశేషాలు బయటపడి ఎండకు చనిపోతాయి. దీని వల్ల ఖరీఫ్ సాగులో చీడపీడల, పురుగుల బెడద తగ్గుతుంది.

అనారోగ్యంతో వీఆర్వో మృతి



వన్నూర్‌స్వామి (ఫైల్)

కంబదూరు: మండల కేంద్రానికి చెందిన వీఆర్వో నీరుగంటి వన్నూర్‌స్వామి (40) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. ఇతను కుందుర్పి మండలంలో వీఆర్వోగా పని చేస్తూ సస్పెండ్ అయ్యాడు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అనంతపురంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు.

యువకుడి అదృశ్యం



పవన్‌కుమార్ (ఫైల్)

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని మారంపల్లి కాలనీకి చెందిన పూజారి పవన్ కుమార్ అనే యువకుడు శనివారం ఉదయం నుంచి కనపించకుండా పోయాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు స్థానిక పట్టణ పోలీస్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అదృశ్యం అయిన పవన్‌కుమార్ రాయదుర్గంలో పాలిటెక్నిక్ కళాశాలలో అటెండర్‌గా పని చేస్తున్నాడు. పవన్‌కుమార్ ఆచూకీ తెలిసిన వారు సెల్: 8309620777, 8985598183 ఈ నంబర్లకు సమాచారం ఇవ్వాలని కుటుంబ సభ్యులు తెలిపారు.

నీలగిరిస్వామి ఆలయంలో విశేష పూజలు

వజ్రకరూరు: స్థానిక కురుబ వీధిలోని నీలగిరి స్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలతోపాటు ఆకుపూజ, మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం, విశేష పూజలు, ప్రత్యేక అలంకరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. స్థానికులతోపాటు చుట్టుపక్కల గ్రామాల భక్తులు ఆలయానికి చేరుకొని స్వామిని దర్శించుకున్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో కార్డన్ సెర్చ్



కెంచంపల్లిలో మాట్లాడుతున్న పోలీసులు



బెళుగుప్పలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

కుందుర్పి: కళ్యాణదుర్గం టౌన్ సీఐ హరినాథ్, రూరల్ అప్‌గ్రేడ్ సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సమస్యాత్మక గ్రామమైన కెంచంపల్లిలో కార్డెన్‌సెర్చ్‌లో భాగంగా పాత కేసుల్లో ఉన్న నిందితుల ఇళ్లలో సోదాలు చేశారు. గ్రామంలో ప్రధాన రహదారులు, కాలనీలలో కవాతు నిర్వహించారు. స్థానిక ప్రజలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, ఎలాంటి గొడవలు, అల్లర్ల జోలికి వెళ్లకుండా ప్రశాంతంగా మెలగాలని సూచించారు. కౌంటింగ్ రోజున ఎన్నికల నిభంధనలను ఉల్లంఘించకుండా పోలీసులకు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో కుందుర్పి ఎస్ఐ వెంకటస్వామి, బ్రహ్మసముద్రం ఎస్ఐ పరశురాముడు, 20 మంది పోలీసులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

బెళుగుప్ప: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని ఉరవకొండ రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు. ఆదివారం మండల పరిధిలోని తగ్గుపర్తి, బెళుగుప్పలోని పలు కాలనీల్లో కేంద్ర సాయుధ బలగాలు, స్థానిక పోలీసులతో కలిసి కవాతు నిర్వహించారు. ఎన్నికలు ఫలితాలు వెలువడిన సమయంలో గ్రామాల్లో ప్రశాంతంగా ఉండాలన్నారు. ఎవరైనా అల్లర్లు చేసినా, ప్రశాంతతకు భంగం కలిగించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ శివ, ఏఎస్ఐ రామదాసు, పోలీసులు పాల్గొన్నారు.

చదువు ప్రాముఖ్యతను గుర్తించాలి

- గవిమఠం ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవ రాజేంద్రస్వామి



పురస్కారాలు పొందిన విద్యార్థులతో గవిమఠం ఉత్తరాధికారి, వీరశైవ లింగాయత్ నాయకులు

ఉరవకొండ: దేశం అన్ని రంగాల్లో ప్రగతి సాధించాలంటే చదువు ఎంతో ముఖ్యమని ఉరవకొండ గవిమఠం ఉత్తరాధికారి డాక్టర్ శ్రీ కరిబసవరాజేంద్ర స్వామి పేర్కొన్నారు. చదువు ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ఆదివారం స్థానిక వీరశైవ కళ్యాణ మండపంలో ఉరవకొండ నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలో 2023–24లో పదో తరగతి చదివి 60శాతానికి పైగా మార్కులు సాధించిన వీరశైవ లింగాయత్ విద్యార్థిని, విద్యార్థులకు నగదు, షీల్డ్, ప్రశంసా పత్రాల పురస్కారాలు అందించారు. తాలుకా వీరశైవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమానికి ఉత్తరాధికారితో పాటు వీరశైవలింగాయత్ కార్పొరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పాల్తూరు దండిన శివానంద, జంగమ సంక్షేమ సంఘం అధ్యక్షులుడు బండయ్య, సభా అధ్యక్షుడు కె.మల్లికార్జున, అమ్మతొలి దైవం అధ్యక్షుడు పాటిల్ రాజశేఖర్, చంద్రిక మల్లికార్జున, వెలిగొండ గంగాధర్, పాటిల్ నిరంజన్‌గౌడ్, శంకర్‌గౌడ్, నాగన్నగౌడ్, దేశాయివిరేష్, ఎర్రిస్వామి, రవి తదితరులు పాల్గొన్నారు. పురస్కారాలకు ప్రభుత్వ పాఠశాలలో చదవిన 17 మందిని ఎంపిక చేసి వారికి నగదుతో పాటు షీల్డ్, ప్రశంసా ప్రతాలు అందించారు.



చింతవృక్షాలను నరికేసిన దృశ్యం



చింతవనంలో చెట్లు కొట్టేయడంతో మొద్దులు కనిపిస్తున్న దృశ్యం

పచ్చదనంపై గొడ్డలివేటు

'ప్రకృతిని పరిరక్షిద్దాం.. పచ్చదనాన్ని పెంచుదాం..' ప్రతి ఒక్కరూ మొక్కలు నాటండి.. పర్యావరణాన్ని పరిరక్షించండి' అని ప్రకృతి ప్రేమికులు ఓ వైపు .. ప్రభుత్వం మరో వైపు ప్రచారం చేస్తున్నా.. కొందరు స్వార్థ పరులు పచ్చదనాన్ని తుంచేస్తున్నారు.. చెట్లను నిట్టనిలువునా నరికేస్తున్నారు. దీంతో ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని పంచుతున్న వృక్ష సంపద అంతరిస్తోంది. భవిష్యత్తు తరాలకు అంధకారమే ఆస్తిగా మిగులుతోంది.

– రాయదుర్గం:

- అనుమతి లేకుండా చెట్ల నరికివేత
- కనుమరుగవుతున్న ప్రకృతి వనం
- చోద్యం చూస్తున్న రెవెన్యూ, అటవీశాఖ అధికారులు

రాయదుర్గం పరిసరాల్లో పెరిగిన పచ్చని చెట్లకు రక్షణ లేకుండా పోతుంది. పైతోట నర్సరీ క్షేత్రం వద్ద విలువైన నీలగిరి కలప ఇప్పటికే కనుమరుగైపోయింది. తాజాగా పట్టణ సమీపంలోని అడిగుప్ప దారిలోని బైలాంజనేయ స్వామి ఆలయం ముందు ఓ రైతు క్షేత్రంలో పెరిగిన చింతవనం చెదిరిపోనుంది. దశాబ్దాల వయసున్న వృక్షాలను ఎలాంటి అనుమతి తీసుకోకుండా నిట్టనిలువునా నిరికివేశారు. చూసిన కనులు పాపంగా భావిస్తున్నా, సంరక్షించాల్సిన అధికారుల చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వనం పెరిగితేనే ప్రజారోగ్యం పదిలం. అడవికి అందాలుగా చెప్పుకునే వన్యప్రాణులు సురక్షితం. దీన్ని దృష్టిలో ఉంచుకునే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెట్ల పెంపకం, వాటి సంరక్షణకు ఏటా రూ.కోట్లు ఖర్చు చేస్తున్నాయి. వాటి విలువ తెలియని కొందరు రైతుల్లో అవగాహన పెంచాల్సి వస్తోంది. తప్పనిసరిగా నరకాల్సి వస్తే తీసుకోవాల్సిన అనుమతులపై తెలియజేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

వాల్టా చట్టం ఏం చెబుతోంది

వాల్టా చట్టం–2002 ప్రకారం సొంత స్థలంలో పెంచుకున్న చెట్లను నరకడం చట్టరీత్యా నేరం. ఒకవేళ కొట్టేయాల్సి వస్తే అటవీ, రెవెన్యూ శాఖ అధికారుల అనుమతి తప్పనిసరి. రైతు విజ్ఞప్తిని పరిశీలించి, అనుమతులిస్తేనే కొట్టేయడానికి ఆస్కారం ఉంది. దళారుల దగాకు ఏ ఒక్కరైతూ బలికావొద్దు. అనుమతులు లేకుండా గొడ్డలి వేస్తే భారీ మూల్యం తప్పదు. రహదారుల విస్తరణ నిమిత్తం చెట్టు నరికేయాలన్నా సంబంధిత శాఖకు తగిన రుసుం చెల్లించి, అనుమతులు తీసుకోవాల్సి ఉంది.

చర్యలు చేపడతాం

అడిగుప్ప దారిలోని బైలాంజనేయస్వామి ఆలయం ఎదుట వ్యవసాయ క్షేత్రంలో పెంచుకున్న చింతవనం నరికేసినట్లు మా దృష్టికి వచ్చింది. అది పూర్తిగా ప్రైవేటు స్థలంలో ఉంది. రైతు వాటిని ఎందుకు తొలగిస్తున్నారో విచారిస్తాం. అనుమతులేకుండా ఒక్క చెట్టు నరికి, కలపను తరలించినా చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే సిబ్బందిని పంపి అడ్డుకున్నాం. వనంలో సుమారు 120 చెట్లు ఉండొచ్చని అంచనా. దళారుల ప్రమేయం ఉన్నా చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ స్థలాల్లో ఉన్న చెట్లను నరికివేయకుండా సంరక్షిస్తున్నాం. ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్తాం. చెట్లు తొలగించాల్సి వస్తే అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. – ఆంజనేయులు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, రాయదుర్గం



డిపోకు తరలించేందుకు సిద్ధం చేస్తున్న మొద్దులు



కలపగా మారిన వృక్షాలు

హద్దు మీరితే రౌడీషీట్లు తెరుస్తాం

- లెక్కింపు రోజు అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు
- కళ్యాణదుర్గం డీఎస్పీ జీ శ్రీనివాసులు



రాయదుర్గం: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ఈనెల 13న సబ్ డివిజన్ వ్యాప్తంగా ప్రశాంతంగా ముగిసింది..

జూన్ 4న ఎన్నికల లెక్కింపునకు అధికార యంత్రాంగం సన్నద్ధమైంది. దీనికి మరో ఏడు రోజులే గడువు ఉంది. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు.. డీఎస్పీ బి. శ్రీనివాసులు ప్రణాళికతో పటిష్ట చర్యలు చేపట్టారు. ఓట్ల లెక్కింపు తర్వాత హింసాత్మక ఘటనలు ఉత్పన్నం కాకుండా ఉక్కుపాదం మోపారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లోని సమస్మాత్మక గ్రామాల్లో ఇప్పటికే మాక్‌డ్రిల్, కవాతు, కార్డన్‌సర్చ్ లాంటి కార్యక్రమాలు నిర్వహించారు. తనిఖీలు ముమ్మరం చేశారు. గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ బి. శ్రీనివాసులు ఆదివారం 'సాక్షి' తో పలు అంశాలను వెల్లడించారు.

డివిజన్ వ్యాప్తంగా 144 సెక్షన్ :

సబ్ డివిజన్ పరిధిలోని రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లోని 2 అర్బన్, 11 మండల పోలీస్‌స్టేషన్ల పరిధిలోనూ 144 సెక్షన్‌తో పాటు 30 పోలీస్‌యాక్ట్ అమల్లోకి తీసుకొచ్చామని డీఎస్పీ తెలిపారు. కౌంటింగ్ ముగిశాక ఎక్కడైనా ఘర్షణలు, హింసాత్మక ఘటనలు చోటు చేసుకోకుండా ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలోనూ ఎస్ఐతో పాటు సిబ్బందిని అందుబాటులో ఉంచుతామన్నారు. చిన్నపాటి అల్లర్లు చేసినా స్టేషన్‌కు తరలిస్తామన్నారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు సహకరించాలని కోరారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఏ పార్టీ గెలిచినా విజయోత్సవ ర్యాలీలు, బాణాసంచా పేలుళ్లకు అనుమతించేదిలేదన్నారు. పెట్రోల్, డీజిల్ వంటివి బాటిళ్లకు వేయకుండా డీలర్లకు, దుకాణదారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. జూన్ 6వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందన్నారు. డివిజన్ వ్యాప్తంగా అన్ని పార్టీల నుంచి ముఖ్యమైన నాయకుల బైండోవర్లు పెంచామన్నారు. ఇందుకు ప్రతినిధులంతా సహకరించాలన్నారు. ఇప్పటికే రౌడీషీటర్ల బైండోవర్ పూర్తి చేశామన్నారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండాలన్నదే తమ లక్ష్యమన్నారు. ఈ నెల 19 నుంచి డివిజన్ వ్యాప్తంగా సీఐ, ఎస్ఐల ఆధ్వర్యంలో సిబ్బంది అనుమానిత గ్రామాల్లో కార్డర్ సెర్చ్‌లు, తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. సరైన పత్రాలు లేకుంటే వాహనాలను సీజ్ చేయించామన్నారు.